క్లుప్తంగా

పాలిటెక్నిక్ కళాశాలలో స్పాట్ అడ్మిషన్లు

కలికిరి: ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో స్పాట్ అడ్మిషన్లకు అవకాశం కల్పిస్తున్నట్లు ప్రిన్సిపాల్ శ్రీనివాసులు ఒక ప్రకటనలో తెలిపారు. కౌన్సెలింగ్ ద్వారా ప్రవేశం అనంతరం మిగిలిన సీట్ల భర్తీకి సాంకేతిక విద్యాశాఖ డైరెక్టర్ నోటిఫికేషన్ విడుదల చేశారని, 10వ తరగతిలో ఉత్తీర్ణత సాధించి ఉండి పాలిటెక్నిక్ కళాశాలలో చేరదలుచుకున్న విద్యార్థులు ఈ నెల 30వ తేదీన మంగళవారం సాయంత్రం 5 గంటల లోపు నేరుగా దరఖాస్తు చేసుకుని, 31న ఉదయం 10 గంటలకు ఒరిజినల్ సర్టిఫికెట్‌లతో కళాశాలకు హాజరుకావాలని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు 9505504200, 9966209000 నంబర్లను సంప్రదించవచ్చన్నారు. అవకాశాన్ని అర్హత, ఆసక్తి కలిగిన విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

రైతు సేవాకేంద్రం తనిఖీ

పెద్దమండ్యం: మండలంలోని కోటకాడపల్లె రైతు సేవా కేంద్రాన్ని పశుసంవర్ధకశాఖ మదనపల్లె డివిజన్ ఉపసంచాలకులు డాక్టర్ సత్యనారాయణ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పశుసంవర్ధకశాఖ రికార్డులను ఆయన పరిశీలించారు. సచివాలయ పరిధిలోని గ్రామాలు, పశువుల సంఖ్యపై ఆరా తీశారు. ప్రభుత్వ పథకాలను, పశువుల టీకాల కార్యక్రమాలపై రైతులకు అవగాహన కల్పించాలన్నారు. వీటని క్షేత్రస్థాయిలో రైతులు సద్వినియోగం చేసుకొనేలా సిబ్బంది పనిచేయాలన్నారు. పశువులకు వచ్చే సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో డాక్టర్ విక్రమ్‌రెడ్డి, పశువైద్య సిబ్బంది గుణశేఖర పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని వినతి

మదనపల్లె సిటీ: విద్యారంగంలో నెలకొన్న సమస్యలు పరిష్కారించాలని యూటీఎఫ్ అధ్యక్ష, కార్యదర్శులు గాలి రవీంద్ర, సుధాకర్ నాయుడు ఎంఈఓ ప్రభాకర్‌రెడ్డికి శుక్రవారం వినతిపత్రం అందజేశారు. జీఓ 117 రద్దు చేయాలని, ప్రీప్రైమరీతో పాటు 1 నుంచి 5 తరగతులను ఒకే పాఠశాలగా నడపాలన్నారు. హైస్కూల్స్‌లో రెండు మీడియంలను సమాంతరంగా కొనసాగించాలన్నారు. ఉపాధ్యాయులకు బోధనేతన పనుల నుంచి మినహాయించాలన్నారు. పాఠశాలకు అన్ని రకాల గ్రాంట్లు మంజూరు చేయాలన్నారు. కార్యక్రమంలో యుటీఎఫ్ నాయకులు పురం రమణ, సుధాకర్, సుబ్రమణ్యం, విజయకుమార్ పాల్గొన్నారు.

కోర్టు గంగమ్మకు ప్రత్యేక పూజలు



మదనపల్లె సిటీ: మదనపల్లె పట్టణం కోర్టు ఆవరణంలో వెలసిన గంగమ్మ ఆలయంలో శుక్రవారం ప్రత్యేక అలంకరణ చేసి పూజలు చేశారు. రాహు,కాల పూజలు నిర్వహించారు. మహిళలు ఆలయం ఎదుట నిమ్మకాయలతో నెయ్యి దీపాలు వెలిగించి మొక్కులు తీర్చుకున్నారు. భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.కార్యక్రమంలో కమిటీ సభ్యులు పాల్గొన్నారు. స్థానిక వాసవీభవన్ వీధిలోని వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారిని శాకంబరి దేవిగా అలంకరించి పూజలు చేశారు.

29 నుంచి ఆడికృత్తిక మహోత్సవాలు

వాల్మీకిపురం: వాల్మీకిపురం పడమర పొలిమేర ధర్మపథంలో వెలసిన శ్రీ కార్యసిద్ధి అభయాంజనేయస్వామి సమూహ దేవాలయంలో ఈ నెల 29, 30వ తేదిల్లో ఆడికృత్తిక మహోత్సవాలు నిర్వహించనున్నట్లు షిరిడిసాయి సాలిగ్రామ తిరునారాయణ ధార్మిక సేవ ట్రస్టు వ్యవస్థాపకులు సాలిగ్రామ శ్రీనివాసాచార్యులు తెలిపారు. ఈ నెల 29 సోమవారం సాయంత్రం 6గంటలకు స్వామివారికి విశేష అభిషేకాలు, పూజలు, నాగహారతుల సమర్పణ జరుగుతాయన్నారు. 30వ తేది మంగళవారం కాలాభిషేకం, ఆడికృత్తిక సందర్భంగా శ్రీ వల్లిదేవ సేన సమేత శ్రీ కళ్యాణ సుబ్రహ్మణ్యస్వామి వారి రథోత్సవం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో భక్తులు పాల్గొని, స్వామివారి కృపకు పాత్రులు కావాలని ఆయన కోరారు.

ఉత్తమ ఫలితాల సాధనకు కృషి చేయాలి

తంబళ్లపల్లె: ప్రభుత్వ పాఠశాలల్లో ఉత్తమ ఫలితాలు సాధించేందుకు ఉపాధ్యాయులు సమష్టిగా పని చేయాలని ఎంపీడీఓ కృష్ణమూర్తి కోరారు. శుక్రవారం తంబళ్లపల్లె ఉన్నత పాఠశాలను తనిఖీ చేశారు. టీచర్ల పనితీరుపై హెచ్‌ఎం శ్రీనివాస్‌ను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులతో సమస్యలపై ఆరా తీశారు. టీచర్లు విద్యార్థులకు అర్థమయ్యే విధంగా నాణ్యమైన విద్యాబోధన చేయాలని సూచనలు ఇచ్చారు. అనంతరం మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. మెనూ మేరకు భోజనం నాణ్యతగా వండి పెట్టాలని కుకింగ్ కమిటీ సభ్యులకు సూచనలు ఇచ్చారు.

సామాజిక ఆరోగ్య కేంద్రంలో నీటి సమస్య

- ఇంజినీరింగ్ అధికారుల నిర్లక్ష్యమే శాపం
- రోగులకు తప్పని అవస్థలు



సామాజిక ఆరోగ్య కేంద్రం

తంబళ్లపల్లె: స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రంలో నాలుగు నెలలుగా నీటి సమస్య ఏర్పడింది. ఇంజినీరింగ్ అధికారుల నిర్లక్ష్యమే శాపంగా పరిణమించి రోగులకు అవస్థలు పడుతున్నారు. 30 పడకల ఆస్పత్రిని అప్‌గ్రేడ్ చేసి రూ.4.65 కోట్ల అంచనా విలువతో నూతన భవనాన్ని నిర్మించారు. మార్చి 14వతేదీ భవనాన్ని ప్రారంభించారు. అందులోనే నూతన బోరు ఏర్పాటు చేసి నీటి సౌకర్యం కల్పించాల్సి ఉంది. సంబంధింత ఇంజినీరింగ్ అధికారుల నిర్లక్ష్యంతో నూతన బోరు ఏర్పాటు చేయకపోవడం సమస్య ఏర్పడింది. గతంలో ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన బోరు భూగర్భజలాలు అడుగంటి ఆగిపోయాయి. ఆస్పత్రికి రోజు 300 మందికిపైగా ఓపి పేషంట్లు వస్తారు. పెద్దమండ్యం, ములకలచెరువు మండలాల నుంచి పేషంట్లు వైద్యం కోసం ఇక్కడికి వస్తారు. రోజు వారి 30 నుంచి 40 మంది వరకు ఇన్‌పేషంట్లు వైద్యం పొందుతున్నారు. కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు, కాన్పుల కోసం గ్రామీణ గర్భిణులు వస్తుంటారు. వారికి సహాయకులుగా వచ్చే వారు బాత్‌రూము, లెట్రిన్ వెళ్లాలన్నా నీటి కొరతతో అవస్థలు పడాల్సి వస్తోంది. ఈ విషయమై సంబంధింత వైద్య ఉన్నతాధికారులు, ఇంజినీరింగ్ అధికారులకు తెలిపినా ప్రయోజనం లేకపోతుందని మెడికల్ ఆఫీసర్ వెంకటరామయ్య ఆవేదన వ్యక్తం చేశారు. రోజువారి సొంత నిధులతో రూ.500 మేరకు ఒకటి,రెండు నీటి ట్యాంకులు కొనుగోలు చేస్తున్నట్లు తెలిపారు. ఒకోక్కసారి ఆ నీళ్లు కూడా సరిపోవడం లేదని తెలిపారు.

రోగుల అవస్థలు పట్టించుకోరా?



ప్రభుత్వ ఆస్పత్రిలో అన్ని సౌకర్యాలు ఉంటాయని కాన్పు కోసం ఇక్కడికి వచ్చాం. ఇక్కడ నీటి సమస్యతో ఇబ్బందులు పడుతున్నాం. బయట నుంచి నీళ్లు తెచ్చుకోవాల్సి వస్తోంది. పల్లెల నుంచి మాలాంటి వారు ఈ ఆస్పత్రికి రాక తప్పడం లేదు. రోగుల అవస్థలు పట్టించుకోకపోతే ఎలా?.. నీటి సమస్య తీర్చి వైద్య సేవలు అందించాలి .

-శ్రావణి, గర్భిణి మాక్కీరివారిపల్లె, తంబళ్లపల్లె

అధికారులు పట్టించుకోవడం లేదు



ఇంజినీరింగ్ అధికారుల నిర్లక్ష్యమే నీటి సమస్యకు కారణమైంది. వారికి ఎన్ని సార్లు తెలియజేసినా రేపు, మాపు అంటూ కాలయాపన చేస్తున్నారన్నారు. సీజనల్ వ్యాధుల బారిన పడి డయేరియా, మలేరియా జబ్బులతో అధిక సంఖ్యలో ఆస్పత్రికి పేషంట్లు వస్తున్నారన్నారు. నీటి సమస్యతో ఆస్పత్రికి వచ్చే వారు తీవ్ర అవస్థలు ఎదుర్కోవాల్సి వస్తోంది.

-డాక్టర్ వెంకటరామయ్య, మెడికల్ ఆఫీసర్

ఎల్లమ్మ జాతరకు సర్వం సిద్ధం

– నేటి నుంచి గ్రామదేవత తిరునాల


జాతరకు ముస్తాబైన ఎల్లమ్మ ఆలయం

కలికిరి: కలికిరి పట్టణంలో వెలసిన కలికిరి గ్రామ దేవత, భక్తులు కోర్కెలు తీర్చే చల్లని తల్లి ఎల్లమ్మ తిరునాల శనివారం నుంచి ప్రారంభమవుతుందని ఆలయ ధర్మకర్త రెడ్డివారి అశోక్‌కుమార్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ నాలుగు రోజుల పాటు వైభవంగా, భక్తిశ్రద్ధలతో నిర్వహించే జాతరలో అన్నమయ్య, చిత్తూరు, తిరుపతి జిల్లాల నుంచే కాకుండా, ఇతర రాష్ట్రాల నుంచి కూడా భక్తులు పాల్గొని అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకుంటారని వివరించారు. జాతరలో భాగంగా ఆలయ ఆవరణంలో శనివారం రాత్రి అమ్మవారి హరికథా కాలక్షేపం, జాగరణ జరుగుతుందన్నారు. ఆదివారం ఉదయం అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని తేరులో ప్రత్యేక అలంకరణ మధ్య కలికిరి పట్టణంలో ఊరేగింపు, తదుపరి సిద్ద పూజ, అనంతరం మధ్యాహ్నం నుంచి భక్తులు అమ్మవారికి దీలు, బోనాలు సమర్పణ కార్యక్రమం ఉంటుందని ఆయన తెలిపారు. సోమవారం నుంచి అమ్మవారు ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనం, రాత్రి లంకాదహనం, తేరులో పుష్పపల్లకి సేవ నిర్వహిస్తామన్నారు. 30వ తేది మంగళవారం జరుగు పార్వేట ఉత్సవంతో జాతర ముగుస్తుందని చెప్పారు. ఈ జాతరలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులు కావాలని ధర్మకర్త కోరారు. ఆలయ పరిసరాలలో భక్తుల తోపులాటలు చోటు చేసుకోకుండా ప్రత్యేక క్యూ ఏర్పాటు చేసినట్లు వివరించారు.

జాతరకు ఆర్టీసీ ప్రత్యేక సర్వీసులు

కలికిరి ఎల్లమ్మ జాతర ను పురష్కరించుకుని పీలేరు ఆర్టీసీ డిపో నుంచి 30 ప్రత్యేక సర్వీసులను నడపనున్నట్లు పీలేరు డిఎం కె.కుమార్ తెలిపారు. 28న ఆదివారం, 29న సోమవారం రెండు రోజుల పాటు పీలేరు-కలికిరి 12 సర్వీసులు, కలికిరి-కలకడ మార్గంలో 5 సర్వీసులు, సోమల-కలికిరి 5, మదనపల్లి-కలికిరి 6 సర్వీసులు, కలికిరి-సదుం మార్గంలో 2, మొత్తం 30 సర్వీసులను భక్తుల సౌకర్యార్థం నడపటం జరుగుతుందని, భక్తులు ఈ సదుపాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని డీఎం కోరారు.

పెద్దిరెడ్డి కుటుంబంపై కక్షపూరిత ధోరణి

- మనదపల్లి సబ్‌కలెక్టరేట్ ప్రమాదంపై పూర్తి స్థాయి విచారణ జరపాలి
- నిజానిజాలు తెలుసుకుని అధికార పార్టీ నేతలు మాట్లాడాలి
- మార్క్‌ఫెడ్ మాజీ చైర్మన్ నల్లారి తిమ్మారెడ్డి



కలికిరి: రాష్ట్ర మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి కుటుంబంపై టీడీపీ ప్రభుత్వం కుట్ర పూరితంగా వ్యవహరిస్తోందని రాష్ట్ర మార్క్‌ఫెడ్ మాజీ చైర్మన్ నల్లారి తిమ్మారెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ సుదీర్ఘ రాజకీయ చరిత్ర కలిగినటువంటి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని, రాజంపేట పార్లమెంటు సభ్యులు పెద్దిరెడ్డి మిథున్ రెడ్డిని రాజకీయంగా ఎదుర్కోలేకనే అధికారపక్ష నేతలు అసందర్భ, అసత్య ఆరోపణలు చేయడం దారుణమన్నారు. మదనపల్లి సబ్ కలెక్టర్ కార్యాలయంలో చోటు చేసుకున్న ప్రమాద ఘటనకు వారిని బాధ్యులు చేస్తూ కొందరు నేతలు మాట్లాడుతున్నారన్నారు. ఈ ఘటనపై జిల్లా అధికార యంత్రాంగంపై నమ్మకం లేకనే రాష్ట్రస్థాయి అధికారులను విచారించమని స్వయానా సీఎం చంద్రబాబు ఆదేశించారన్నారు. సబ్ కలెక్టర్ కార్యాలయంలో ప్రమాదంలో రికార్డులు కాలిపోతే సంబంధిత తహసీల్దారు కార్యాలయం, కలెక్టరు కార్యాలయం, సీసీఎల్ఏలో రికార్డులు ఉంటాయన్నారు. ఘటనపై స్పందించిన ఎంపీ మిథున్ రెడ్డి తమ కుటుంబంపై చేస్తున్న ఆరోపణలు నిరూపిస్తే రాజకీయాల నుంచి తప్పుకుంటామన్న సవాల్‌కు వారిని విమర్శించిన ఏ ఒక్కరూ స్పందించకపోవడం పెద్దిరెడ్డి కుటుంబం దార్శనికతకు అద్దపడుతోందన్నారు. ఇప్పటికైనా అసత్య ఆరోపణలు మానుకోవాలని టీడీపీ నేతలకు హితవుపలికారు.

అంటువ్యాధుల నివారణపై అవగాహన

– డిప్యూటీ డీఎంహెచ్ఓ రమేష్‌బాబు


సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న డిప్యూటీ డీఎంహెచ్ఓ రమేష్‌బాబు

మదనపల్లె : అంటువ్యాధుల నివారణపై క్షేత్రస్థాయిలో వైద్య ఆరోగ్య సిబ్బంది ప్రజలకు అవగాహన కల్పించాలని డిప్యూటీ డీఎంహెచ్ఓ రమేష్‌బాబు అన్నారు. శుక్రవారం స్థానిక ప్రభుత్వ జిల్లా ఆస్పత్రిలోని డిప్యూటీ డీఎంహెచ్ఓ కార్యాలయంలో దొంతివీధి అర్బన్ హెల్త్ సెంటర్ వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ...సచివాలయాల పరిధిలో అంటువ్యాధులు వ్యాప్తి చెందకుండా ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలియజేయాలన్నారు. ఫీవర్ సర్వే నిర్వహించి, జ్వరపీడితులను గుర్తించి సరైన పరీక్షలు నిర్వహించాలన్నారు. సీజనల్ వ్యాధులు వ్యాప్తి చెందకుండా ప్రజలు వేడి నీటిని, ఆహారపదార్థాలను ఉపయోగించాలన్నారు. పరిసరాల పరిశుభ్రత పాటించాలన్నారు. అదేవిధంగా గర్భవతులు, పాలిచ్చే తల్లులకు అందుతున్న వైద్యసేవలు, బీసీజీ వ్యాక్సినేషన్, లెప్రసీ సర్వే, డయేరియా, డెంగ్యూ, బ్రెస్ట్ ఫీడింగ్, నెఫా వైరస్, ఇమ్యునైజేషన్, అనీమియా తదితర కార్యక్రమాలపై అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ డాక్టర్.సాల్మన్, జిల్లా ప్రోగ్రాం కోఆర్డినేటర్ ప్రణీత్, సూపర్‌వైజర్ మహి, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

జీఏపీ సర్టిఫికెట్‌తో పంటకు మంచి ధర

– ఏడీఏ శివకుమార్


జీఏపీ-పొలంబడిపై రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయశాఖ అధికారులు

మదనపల్లె : పంట ఉత్పత్తులకు మంచి ధర రావాలంటే ఎగుమతుల ప్రమాణాలకు అనుగుణంగా గుడ్ అగ్రికల్చర్ ప్రాక్టీస్(జీఏపీ) సర్టిఫికెట్ ఉండాలని వ్యవసాయశాఖ సహాయసంచాలకులు శివశంకర్ తెలిపారు. మండలంలోని కోళ్లబైలు పంచాయతీ మేకలవారిపల్లెలో శుక్రవారం వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో జీఏపీ-పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా రైతులకు వేరుశెనగ పంటలో మేలైన సాగుపద్ధతులు(జీఏపీ) గురించి శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. పంటకాలం పూర్తయిన తర్వాత శిక్షణలో పాల్గొన్న రైతులందరికీ వారి పొలాలకు సంబంధించి ఇండిగాప్ సర్టిఫికేషన్ చేస్తామన్నారు. ఈ సర్టిఫికేషన్ పొందిన వ్యవసాయ ఉత్పత్తులను ఏపీ మాస్ ఎన్‌జీఓకు చెందిన మర్యాదరామన్నపట్నం ఎఫ్‌పీఓ ద్వారా మంచి ధరలకు సేకరించడం జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా పొలంబడిలో శిక్షణ పొందుతున్న రైతులకు , ఎఫ్‌పీఓ సంస్థకు మధ్య అవగాహన ఒప్పందం చేసుకున్నారు. విత్తనం నుంచి పంటనూర్పిడి వరకు రైతులకు పొలంబడి ద్వారా శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఏఓ నాగప్రసాద్, వ్యవసాయ సహాయకులు శేఖర్, పృథ్వీరాజ్, సాయిచంద్రమౌళి, మర్యాదరామన్నపట్నం ఎఫ్‌పీఓ ప్రతినిధులు వాసుదేవరెడ్డి, అమరేంద్ర, రైతులు పాల్గొన్నారు.

బంకుల తొలగింపుపై ఉద్రిక్తత


పంచాయతీ సిబ్బందితో వాగ్వాదం చేస్తున్న స్థానికులు

గుర్రంకొండ: గుర్రంకొండ బస్టాండులో బంకుల తొలగింపుపై ఉద్రిక్తత నెలకొన్న సంఘటన గురువారం రాత్రి చోటుచేసుకుంది. బస్టాండు నుంచి బజారువీధికి వెళ్లే మార్గంలో గతంలో ఏర్పాటు చేసుకొన్న బంకులను తొలగించడానికి పంచాయతీ ఈవో విశ్వనాథ్, కార్యదర్శి నిస్సార్ పంచాయతీ సిబ్బందితో కలసి అక్కడికి చేరుకొన్నారు. అయితే వీధికి ఇరువైపులా ఆక్రమణలు ఉన్నాయని వాటిని తొలగించాలని అక్కడి ప్రజలు పట్టుబట్టారు. అందరికీ నోటిసులు ఇచ్చిన తరువాత వాటిని కుడా తొలగిస్తామని అధికారులు పేర్కొన్నారు. అయితే ససేమీరా అని బంకుల యజమానులు తిరగబడ్డారు. బజారువీధితో పాటు సర్కారుబావివీధి, బజారుసందువీధి, కొత్తపేట, వారపు సంతవీధుల్లో ప్రభుత్వ స్థలాలు ఆక్రమించుకొని బంకులు ఏర్పాటు చేసుకొన్నారని, వాటిని తొలగించాలని డిమాండ్ చేశారు. కేవలం కక్షపూరితంగా ఒక వర్గానికి చెందిన వారి బంకులు తొలగించాలని ప్రయత్నించడం తగదని వాగ్వాదానికి దిగారు. దీంతో బస్టాండులో ఉద్రిక్తత నెలకొంది. ఎస్ఐ నాగార్జున రెడ్డి తమ సిబ్బందితో అక్కడికి చెరుకొని గ్రామంలో శాంతి భద్రతలకు సహకరించాలని అందరికి సర్ది చెప్పి పంపించి వేశారు.

కార్గిల్ అమరవీరులకు నివాళి


పీలేరు : కార్గిల్ అమర వీరులకు నివాళులర్పిస్తున్న దృశ్యం

పీలేరు రూరల్ : స్థానిక నెహ్రూబజార్‌లోని జెడ్పీ మెయిన్ ఉన్నత పాఠశాలలో కార్గిల్ అమరవీరులకు ఘన నివాళులర్పించారు. శుక్రవారం కార్గిల్ అమర వీరుల చిత్ర పటం వద్ద కొవ్వొత్తులు వెలిగించారు. ఈ సందర్భంగా ఎంఈవో లోకేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ కార్గిల్ యుద్ధంలో దేశం కోసం ప్రాణాలు అర్పించిన సైనికులను స్మరించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. కార్గిల్ యుద్ధం జరిగి 25 సంవత్సరాలు పూర్తైందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు సురేంద్రనాథరెడ్డి, ఎస్ఐ రమణ, ఎన్‌సీసీ ఆఫీసర్ జయపాల్‌రెడ్డి, క్యాడిట్లు, ఉపాధ్యాయులు ప్యారూఖాన్, రెడ్డెప్ప, రవి, శ్రీరాములు, భాస్కర్, సరోజమ్మ, విద్యార్థులు పాల్గొన్నారు.

కార్గిల్ వీరుల త్యాగాలు అజరామరం

కురబలకోట: మాతృభూమి కోసం కార్గిల్ వీరుల త్యాగాలు అజరామరమని అంగళ్లులోని మిట్స్ ఇంజినీరింగ్ కళాశాల సలహాదారు డాక్టర్ తులసీరామ్ నాయుడు అన్నారు. శుక్రవారం కళాశాలలో జరిగిన కార్గిల్ విజయ్‌దివస్ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ పాకిస్తాన్ దురహంకారాన్ని భారత్ సైనికులు తిప్పికొట్టారన్నారు. దేశ ఔన్నత్యాన్ని, కీర్తి పతాకాన్ని ఎగురవేశారన్నారు. కార్గిల్ వీరుల సాహసం, త్యాగం, ధైర్యం నేటి యువతకు ఆదర్శమన్నారు. వీరి త్యాగాన్ని దేశ ప్రజలు మరచిపోలేరన్నారు. అవసరమైతే దేశ కోసం ప్రతిఒక్కరూ ప్రాణ త్యాగానికి కూడా సిద్ధంగా ఉండాలన్నారు. ప్రతి ఒక్కరూ దేశాన్ని ప్రేమించాలన్నారు.

అమర జవాన్లకు నివాళి

పెద్దతిప్పసముద్రం: మండల కేంద్రంలో శుక్రవారం కార్గిల్ యుద్ధంలో అశువులు బాసిన వీర జవాన్ల చిత్ర పటాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. బీజేపీ జిల్లా సెక్రటరి మల్లెం శివయ్య, టీడీపీ నాయకులు నందమూర్తి, ఆర్ఎస్ఎస్ నాయకులు రామక్రిష్ణ, కిరణ్‌కుమార్, జనసేన నాయకులు ముద్దసాని నాగరాజు తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

గిరిజనులకు పక్కా ఇళ్లు మంజూరు చేయాలి

కేవీపల్లె : మండలంలోని మఠంపల్లె పంచాయతీ కలికిరివాండ్లపల్లెలో గుడిసెల్లో నివాసం ఉంటున్న గిరిజనులకు పక్కా ఇళ్లు మంజూరు చేసి ఆదుకోవాలని సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి టి.ఎల్. వెంకటేష్ కోరారు. శుక్రవారం గిరిజనులతో సమావేశమై వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజనులకు పక్కా ఇళ్లు మంజూరు చేయడంలో గత ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిందని ఆరోపించారు. కూటమి ప్రభుత్వం స్పందించి నిరుపేదలైన గిరిజనులకు పక్కా గృహాలు నిర్మించి ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

వేగంగా పైపులైన్ల మరమ్మతులు

కేవీపల్లె : మండలంలోని సొరకాయలపేట పంచాయతీలో పైపులైన్ల మరమ్మతులు చురుగ్గా చేపట్టారు. శుక్రవారం సొరకాయలపేట పంచాయతీలో లీకేజీఉన్న పైపులైన్లు గుర్తించి సరి చేశారు. ఈ సందర్భంగా ఈవోపీఆర్‌డీ ఎస్.ఎ. గఫూర్ మాట్లాడుతూ ఎక్కడా తాగునీటి సమస్య తలెత్తకుండా స్వచ్ఛమైన తాగునీరు అందించడానికి చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. అలాగే ప్రజారోగ్యాన్ని కాపాడడం లక్ష్యంగా పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపట్టినట్లు చెప్పారు. కార్యక్రమంలో పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

బీసీజీ టీకాపై అవగాహన

కలకడ : బీసీజీ టీకా వయోజనులకు ఎంతో ప్రయోజనమని హెల్త్‌ఎడ్యుకేటర్ మహమ్మద్‌రఫీ అన్నారు. శుక్రవారం ఎర్రకోటపల్లె పీహెచ్‌సీ పరిధిలోని స్థానిక జామియమసీదు ఆవరణలో ముస్లిం సోదరులకు టీకాపై అవగాహన కల్పించారు. ప్రతి సోమవారం, గురువారం టీబీ జబ్బురాకుండా పూర్తిగా నివారించడానికి ప్రభుత్వం ఉచితంగా బీసీజీ టీకా అందిస్తుందని గుర్తు చేశారు. 60 సంత్సరాలు పైబడినవారు, బీబీ, సిగరెట్, ఇతర పొగతాగుట అలవాటున్నవారు, ఎత్తుకు తగ్గ బరువు లేని వారు విధిగా టీకాలు వేసుకోవాలని కోరారు. క్షయవ్యాదిలేని సమాజం కోసం అందరు కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎంపీహెచ్ఈఓ జయరామయ్య, టీబీ పర్యవేక్షకులు నాగిరెడ్డి, జామియ మసీదు ముతవల్లీ సెకుమాం తదితరులు పాల్గొన్నారు.

కుష్టువ్యాధికి ఉచిత చికిత్స

ప్రారంభ దశలో కుష్టువ్యాధిని గుర్తిస్తే ఆ వ్యక్తికి ఉచిత చికిత్స అందించి పూర్తిగా అంగవైకల్యం నివారించవచ్చునని జిల్లా న్యూక్లియర్‌టీం డిప్యూటీ పారామెడికల్ అధికారి శంభుప్రసాద్ అన్నారు. శుక్రవారం మండలంలోని ఎర్రకోటపల్లె ప్రభుత్వ ప్రాథిక ఆరోగ్యకేంద్రాన్ని తనిఖీ చేశారు. ప్రతి గ్రామంలో క్షేత్ర స్థాయిలోని ఆరోగ్య సిబ్బంది సర్వే పూర్తి చేసి ప్రతి కుటుంబంలోని సభ్యులను తనిఖీ చేయాలన్నారు. ఎలాంటి అనుమానిత కేసులు ఉన్నా వెంటనే స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి నిర్ధారణ కోసం తరలించాలని ఆదేశించారు. అనంతరం క్షేత్ర స్థాయిలో ఇంటింటికి ఆరోగ్యసిబ్బంది చేసిన సర్వే, నమోదులను పరిశీలించారు. కార్యక్రమంలో డాక్టర్ జవహర్‌బాబు, సూపర్‌వైజర్ వెంకటేశ్వరరావు, పీహెచ్ఎన్ సుబ్బరత్న, ఏఎన్ఎంలు, ఆశవర్కర్లు పాల్గొన్నారు.

క్రమశిక్షణతో ఉన్నత శిఖరాలు

బి.కొత్తకోట: క్రమశిక్షతో చదివితే ప్రతి విద్యార్థి ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చని మండలంలోని బడికాయలపల్లె జెడ్పీ హైస్కూల్ హెచ్‌ఎం మోహన్‌నాయుడు అన్నారు. బడికాయలపల్లెకు చెందిన విద్యార్థి మనోజ్‌కుమార్ హిమాచల్‌ప్రదేశ్‌లోని మండి ఐఐటీలో సీఎస్ఈ గ్రూప్‌లో సీటు సాధించాడు. ఈ సందర్భంగా శుక్రవారం మనోజ్‌కు ఉపాధ్యాయుల సత్కార కార్యక్రమం నిర్వహించారు. గ్రామీణ ప్రాంతాలకు చెందిన విద్యార్థులు తమ ప్రతిభను చాటుకుంటున్నారని హెచ్‌ఎం అన్నారు. 10వ తరగతి వరకు బడికాయలపల్లెలో, ఇంటర్ బి.కొత్తకోటలో పూర్తి చేసిన మనోజ్ ఇంటివద్ద ఆన్‌లైన్ క్లాసుల ద్వారా ఐఐటీలో సీటు సాధించడం గర్వకారణమన్నారు. విద్యార్థులు చదువుపై ఆసక్తి పెంచుకుని పై స్థాయికి ఎదగాలన్నారు. మనోజ్‌కు సైంటిఫిక్ క్యాలిక్యులేటర్‌ను బహూకరించారు.

పీర్ల ఊరేగింపు

పెద్దతిప్పసముద్రం: మండలంలోని తుమ్మరకుంట పంచాయతిలో పీర్ల పండుగ వేడుకలు నాలుగు రోజులుగా ఘనంగా నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యంలో శుక్రవారం బొమ్మిరెడ్డిపల్లి, సామాడుపల్లి, గజ్జెలవారిపల్లి గ్రామాల్లోని పుర వీధుల్లో పీర్ల ఊరేగింపు కనుల పండుగగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు.

పర్యావరణ పరిరక్షణ మనందరి బాధ్యత


మట్టిగణపతుల ప్రాముఖ్యతను వివరిస్తున్న కళాజాత సభ్యులు

మదనపల్లె : పర్యావరణ పరిరక్షణ ప్రజలందరి బాధ్యత అని మున్సిపల్ కమిషనర్ కే.ప్రమీల అన్నారు. ఆంధ్రప్రదేశ్ పర్యావరణ కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో పర్యావరణ పరిరక్షణలో భాగంగా మట్టిగణపతుల వినియోగంపై ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా శుక్రవారం పట్టణంలోని నీరుగట్టువారిపల్లెలో ఎం.వి.రూరల్ ఫోక్ ఆర్ట్ ఆర్గనైజేషన్ కళాజాత సభ్యులు పర్యావరణ పరిరక్షణపై వివరించారు. పాటలు, మాటల ద్వారా ప్రజలను ఆకట్టుకునేలా, ఆలోచింపజేసేలా మట్టిగణపతుల ప్రాముఖ్యతను తెలియజేశారు. పీఓపీ విగ్రహాలు వాడి పర్యావరణాన్ని కలుషితం చేయవద్దని, మట్టి విగ్రహాలు వాడి భవిష్యత్ తరాలను, ప్రకృతి వనరులను సంరక్షించుకుందామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ సభ్యులు పి.శ్రీనివాసులు, ఏఈ అనిల్‌కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్షయవ్యాధిగ్రస్తులు పూర్తికాలం చికిత్స తీసుకోవాలి


ఎండీఆర్ వ్యాధిగ్రస్తులతో మాట్లాడుతున్న జిల్లా టీబీ ప్రోగ్రాం కోఆర్డినేటర్‌లు

మదనపల్లె : ఎండీఆర్ క్షయవ్యాధిగ్రస్తులు పూర్తికాలం చికిత్స తీసుకుని, వ్యాధిని నయం చేసుకోవాలని టీబీ జిల్లా ప్రోగ్రాం కోఆర్డినేటర్‌లు వెంకటసుబ్బయ్య, ప్రణీత్ అన్నారు. శుక్రవారం స్థానిక ప్రభుత్వ జిల్లా ఆస్పత్రిలో టీబీ వ్యాధిగ్రస్తులకు అందుతున్న చికిత్సపై రోగులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎండీఆర్ పేషంట్లకు అందుతున్న సేవలు, సైడ్ ఎఫెక్ట్స్‌లపై ఫాలోఅప్ చేసి ఏవైనా ఇబ్బందులు గుర్తిస్తే వెంటనే ఉన్నతాధికారులకు తెలపాలన్నారు. వ్యాధిగ్రస్తులు తప్పనిసరిగా పూర్తికాలం మందులు వాడాలన్నారు. వ్యాధిగ్రస్తుల కుటుంబసభ్యులు సైతం తప్పనిసరిగా టీబీ పరీక్షలు చేయించుకోవాలన్నారు. అనంతరం ఆస్పత్రిలోని ఏఆర్‌టీ సెంటర్, టీబీ సెంటర్, ఐసీటీసీ సెంటర్లను తనిఖీ చేశారు. హెచ్ఐవీ, టీబీ పేషెంట్లకు అందుతున్న సేవలపై ఆరా తీశారు. స్టాక్‌రిజిస్టర్‌లను పరిశీలించారు. కార్యక్రమంలో టీబీ సూపర్‌వైజర్ ప్రభాకర్, సిబ్బంది శాంతి, సుశీల, వనజకుమారి, జ్ఞానతిలగం, తరుణ్, సునీత, ఐసీటీసీ సిబ్బంది జయకుమార్, పుల్లయ్య, దీప్తి, ఏఆర్‌టీ సిబ్బంది సుబ్బారెడ్డి, పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.

వెంకయ్యనాయుడి జీవితచరిత్ర పుస్తకావిష్కరణ


వెంకయ్యనాయుడు జీవితచరిత్ర పుస్తకాలను ఆవిష్కరిస్తున్న నాయకులు

మదనపల్లె : బహుబాషా కోవిదుడు, మంచి రాజకీయవేత్త, ఉన్నత విలువలు కలిగిన వ్యక్తిగా మాజీ ఉపరాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు ప్రజల మన్ననలు పొందారని బీజేపీ నాయకులు చల్లపల్లె నరసింహారెడ్డి, డాక్టర్.రాటకొండ గురుప్రసాద్ అన్నారు. శుక్రవారం స్థానిక జ్ఞానాంబిక డిగ్రీ కళాశాలలో మాజీ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడి జీవితచరిత్ర పుస్తకావిష్కరణ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ... నిబద్ధత, నిజాయితీ, క్రమశిక్షణతో కిందిస్థాయి నుంచి ఉపరాష్ట్రపతి పదవివరకు వెంకయ్యనాయుడు ఎదిగారన్నారు. భారత రాజకీయ చరిత్రలో గౌరవనీయమైన స్థానాన్ని పొందిన నేతల్లో వెంకయ్యనాయుడు ఒకరని, పంచకట్టులో, బాష ఉచ్ఛారణలో ఆయనకు ఆయనే సాటి అన్నారు. కార్యక్రమంలో విజయభారతి ఎన్.సేతు, డాక్టర్.అజ్మతుల్లా, ప్రిన్సిపాల్ సురభిరమాదేవి పాల్గొన్నారు.

కంప్యూటర్ పరిజ్ఞానం కలిగిఉండాలి


గుర్రంకొండ : కంప్యూటర్ ఫొటో ఎగ్జిబిషన్ చిత్రాలను ప్రదర్శిస్తున్న విద్యార్థులు

గుర్రంకొండ: విద్యార్థులు కంప్యూటర్ పరిజ్ఞానం కలిగి ఉండాలని ఎంఈవో సుబ్రమణ్యం అన్నారు. శుక్రవారం స్థానిక తెలుగు జెడ్పీహైస్కూల్‌లో శిక్ష సప్తాహ వారోత్సవాల్లో భాగంగా ఫొటోఎగ్జిబిషన్ నిర్వహించారు. ఈసందర్భంగా కంప్యూటర్, ఎలక్ట్రానిక్స్, ఆటోమొబైల్ చిత్రాల ఎగ్జిబిషన్ అందరినీ అలరించింది. అనంతరం ఆయన మాట్లాడుతూ కంప్యూటర్ పుట్టుపూర్వోత్తరాలు నేటి యుగంలో మనం వాడుతున్న ఎలక్ట్రికల్స్, ఆటో మొబైల్స్ రంగలో వాటి పరికరాల గురించి విద్యార్థులు తెలుసుకోవాలన్నారు. చదవుకొనే వయస్సు నుంచే వీటిపై పరిజ్ఞానం పెంచుకోవాలన్నారు. విద్యార్థులకు కంప్యూటర్ పరికరాల వినియోగంపై ప్రదర్శన ఇచ్చారు. కార్యక్రమంలో హెడ్మాస్టర్ అహ్మద్‌బాషా, పీడీ రమేష్, ఉపాధ్యాయులు త్రినాథ్‌రావ్, మదన్మోహన్, జావీద్ పాల్గొన్నారు.

టెక్నాలజీ ప్రాముఖ్యతపై అవగాహన

వాల్మీకిపురం: విద్యలో టెక్నాలజీ ప్రాముఖ్యతపై విద్యార్థులకు అవగాహన కల్పించినట్లు స్థానిక జడ్పీ బాలికోన్నత పాఠశాల ప్లస్ హెచ్‌ఎం శ్రీదేవి తెలిపారు. శుక్రవారం స్థానిక పాఠశాలలో విద్యార్థులకు ఐఎఫ్‌పి, ట్యాబ్స్, టివి, కంప్యూటర్, సెల్‌ఫోన్, ఆండ్రాయిడ్, క్యాలికులేటర్, వర్చువల్ క్లాస్‌రూమ్ తదితర వాటిపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో వెంకటలక్ష్మి, ఉపాధ్యాయులు నాగరత్న, విష్ణువర్ధన్ రెడ్డి, నాగేశ్వర్ రావు, షంషాద్, రాధిక, సుధారాణి, శోభారాణి, వేదవాణి, అనురాధ, రేణుక, ఉమాదేవి పాల్గొన్నారు.